

మూగజీవాలకూ హక్కులున్నాయ్..

శారీరకంగా ఎక్కువగా బాధిస్తే, గొడ్డును బాదినట్లు బాదారు అంటారు. కానీ, ఆ మూగజీవాలకు కూడా అనేక హక్కులున్నాయి.

8లో



రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి ఎంవీ రాఘవ, కుటుంబ సభ్యులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు 9,250 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 9,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,200, మధ్య డెల్టాకు 2,050, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

పర్యాటకాభివృద్ధికి బౌద్ధారామం అనుకూలం

ఐఅండ్‌పీఆర్ జేడీ కిరణ్‌కుమార్



ఆదుర్రు బౌద్ధ స్థూపాన్ని పరిశీలిస్తున్న జేడీ కిరణ్‌కుమార్

మామిడికుదురు: చుట్టూ అందమైన మడ అడవులు కలిగిన ఆదుర్రు బౌద్ధారామం పర్యాటక అభివృద్ధికి ఎంతో అనుకూలంగా ఉందని ఐఅండ్‌పీఆర్ జేడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదుర్రులోని ప్రాచీన ఆది బౌద్ధ స్థూపాన్ని ఆయన ఆదివారం సందర్శించి అక్కడి కట్టడాలను పరిశీలించారు. వైనతేయ గోదావరి నదీతీరంలో ఉన్న ఈ స్థూపాన్ని క్రీస్తు పూర్వం రెండో శతాబ్దంలో అశోకుని కుమార్తె సంఘమిత్ర నిర్మించినట్టు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోందని ఆయన అన్నారు. ఈ స్థూపానికి వచ్చే మార్గంలో సరైన రహదారి మార్గం లేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, పినిశెట్టి శేఖర్ ఉన్నారు.

నేడు పీజీఆర్ఎస్

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్ గోదావరి భవన్‌లో నిర్వహిస్తునట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అర్జీదారులు 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చునన్నారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే అడగవచ్చునన్నారు. కొత్త ఫిర్యాదులు నమోదు చేయవచ్చునన్నారు. ప్రజా సౌకర్యార్థం ఈ వేదికను మూడు రెవెన్యూ డివిజన్లు, 22 మండల కేంద్రాలు, 4 మున్సిపల్ కార్యాలయాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్జీదారులు ఆయా స్థాయిలలో తమ సమస్యలను నమోదు చేసుకుని పరిష్కారం పొందాలన్నారు.

అధ్యాపకుని అరుదైన ఘనత

- అంతర్జాతీయ జర్నళ్లలో ఒకే నెలలో ఐదు పరిశోధన పత్రాల ప్రచురణ



యర్రంశెట్టి విజయ్ సత్య ప్రసాద్

మలికిపురం: భావి తరాల శాస్త్ర సాంకేతిక రంగాలు అన్నీ క్వాంటం టెక్నాలజీపై ఆధారపడే అంశంపై మండలంలోని కేశనపల్లికి చెందిన అధ్యాపకుడు యర్రంశెట్టి విజయ్ సత్య ప్రసాద్ రూపొందించిన పరిశోధనా పత్రాలు అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. తాను రూపొందించిన ఐదు పరిశోధన పత్రాలు ఒకే నెలలో ఆయా అంతర్జాతీయ జర్నళ్లలో ప్రచురితమైనట్టు ఆయన ఆదివారం తెలిపారు. క్వాంటం టెక్నాలజీపై రెండు, ఎలక్ట్రానిక్స్‌లో ఒకటి, ఫిజిక్స్‌పై ఒకటి, సైకాలజీ విభాగంలో ఒకటి మొత్తం 5 పరిశోధన పత్రాలు ఒక్క జూలై నెలలోనే ప్రచురితం కావడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల కరస్పాండెంట్ మంగెన సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ ఎన్.ఆనంద మహని, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పీఎస్ఎన్ రాజు, సీనియర్ అధ్యాపకులు చిట్టాల సత్యనారాయణ, పీడీకే ప్రసాద్, అడ్డాల మణికంఠ తదితరులు ఆదివారం అభినందించారు.

ఎయిడెడ్ టీచర్ పోస్టులకు ఈ నెల 31 తుది గడువు

రాయవరం: రామచంద్రపురం రాజా కాక్–షట్ ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో టీచర్ పోస్టులకు ఈ నెల 31 తుది గడువుగా నిర్ణయించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాజా–కాక్‌షట్ ఎయిడెడ్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్), లాంగ్వేజ్ పండిట్(తెలుగు) ఒక్కొక్క పోస్టుకు, ఎస్‌జీటీ(తెలుగు) రెండు పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 16న విడుదలైన నోటిఫికేషన్‌లో ఎల్‌పీ తెలుగు పోస్టును ఎల్‌పీ హిందీగా ప్రచురితమైనదని, దానిని ఎల్‌పీ తెలుగు పోస్టుగా పరిగణించి అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తుదారులకు పరీక్ష తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

అభివృద్ధికి లాక్‌లు!

- శిథిలావస్థలో చాంబర్లు
- వృథాగా పోతున్న సాగునీరు
- ఏ కాలువకు ఎంతెంత నీరన్నది తెలియని అయోమయ స్థితి
- అస్తవ్యస్తంగా నీటిపారుదల వ్యవస్థ
- వైఎస్ హయాంలో రూ.మూడు కోట్ల మంజూరు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తాత్కాలిక మరమ్మతులు
- ఏడాదిగా పట్టించుకోని కూటమి సర్కార్



చొప్పెల్ల లాకుల వద్ద చాంబర్ వ్యవస్థ దెబ్బతినడంతో వృథా పోతున్న సాగునీరు

ఆలమూరు: ఆంధ్రప్రదేశ్ ధాన్యాగారంగా తూర్పు గోదావరి జిల్లాను మార్చే క్రమంలో గోదావరిపై ధవళేశ్వరం వద్ద సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన బ్యారేజీ ఎప్పటికీ ఓ స్ఫూర్తిదాయకమైన నిర్మాణమే. ఇందులో భాగంగా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన లాకుల వ్యవస్థ ఆ అపర భగీరథుని ఇంజినీరింగ్ నైపుణ్యంలో మరో అద్భుతం. చుక్క నీటినీ వృథా చేయకుండా సద్వినియోగం చేసుకునే క్రమంలో ఏర్పాటు చేసిన ఈ లాకుల వ్యవస్థ నేడు అధ్వాన స్థితికి చేరుకుంది. దీంతో ఏ సమయంలో ఏ కాలువకు ఎంతంత నీరు విడుదల చేయాలన్న స్పష్టమైన అంచనాలు లేక సాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది.

తూర్పు డెల్టా ప్రధాన కాలువపై ఉన్న లాకులను పూర్తిస్థాయిలో ఆధునీకరించపోవడంతో చాంబర్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిని సాగునీరు వృథాగా పోతోంది. వివరాలలోకి వెళితే బ్యారేజీ నుంచి దిగువకు విడుదలయ్యే సాగునీటి ప్రవాహం సమీపంలోని వేమగిరి వద్ద కోటిపల్లి, సామర్లకోట వైపు రెండు కాలువలుగా చీలిపోతాయి. కోటిపల్లి వైపు వెళ్లే ప్రధాన కాలువపై తూర్పు డెల్టా ప్రధాన కాలువపై మండలంలోని చొప్పెల్ల వద్ద ప్రధాన లాకులను నిర్మించగా ఆలమూరు, కపిలేశ్వరపురం, కూళ్ల, మసకపల్లి, ఎర్ర పోతవరం, కేఎంజీ టెయిల్ ఎండ్ వద్ద సబ్ లాకులను ఏర్పాటు చేశారు. ఈ లాకుల కింద రాజమహేంద్రవరం రూరల్, కొత్తపేట, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో సుమారు 12 మండలాల్లో ఉన్న 1.05 లక్షల ఎకరాలలో వరిసాగు అవుతోంది. బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో 1850లో నిర్మించిన ఈ లాకులను 1949లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు చెప్తున్నారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో లాకుల అభివృద్ధికి రూ.మూడు కోట్లు మంజూరు చేయగా, 2019–24 మధ్య కాలంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఏ విధమైన మరమ్మతులూ చేయించకపోవడంతో లాకుల వ్యవస్థ మళ్లీ దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. గోదావరికి 1986లో సంభవించిన వరదల్లో కొట్టుకుపోవలసిన ఈ లాకుల పైభాగంలో ఒక పురాతనమైన చెట్టు అడ్డంగా పడిపోవడంతో వరద ప్రవాహ ఉధృతి తగ్గడంతో లాకులకు ఏ విధమైన హానీ జరగలేదని రైతులు చెబుతుంటారు.

పంట పొలాలకు అందని సాగునీరు

రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనత, ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్య వైఖరితో తూర్పు డెల్టా ప్రధాన కాలువ వెంబడి ఉన్న శివారు పంట పొలాలకు సక్రమంగా సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. తూర్పు డెల్టా ప్రధాన కాలువ వెంబడి ఖరీఫ్‌కు 1.05 లక్షలు, రబీకి 94.5 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుంది. ఖరీఫ్ సీజన్‌కు రోజుకు సుమారు 1200 క్యూసెక్కులు, రబీ సీజన్‌కు 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం ఆనవాయితీగా వస్తోంది. అప్పట్లో ఒక క్యూసెక్కు నీటిని 70 ఎకరాలకు సరిపోయేలా ఈ నీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు జరిగింది. అయితే ప్రస్తుతం లాకుల గేట్లు, పడవలు వెళ్లే చాంబర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో సాగునీరు దిగువకు వృథాగా పోతోంది.

నిర్వీర్యం దిశగా నీటిపారుదల శాఖ

నీటిపారుదల శాఖలోని ప్రధానమైన లాకుల వ్యవస్థతో పాటు మిగిలిన వ్యవస్థలు కూడా అస్తవ్యస్తంగా మారాయి. ఆ శాఖలోని ఉద్యోగులు, సిబ్బంది సంఖ్యను గణనీయంగా కుదించేశారు. కాలువలను శుభ్రపరచే లస్కర్ల వ్యవస్థను నిర్వీర్యం చేశారు. లాకుల నిర్వహణకు వీలుగా ఉద్యోగులకు ఏర్పాటు చేసిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీనివల్ల వ్యవసాయానికి ప్రధానమైన సాగునీటి వ్యవస్థ నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడటంతో కాలువల్లో ఎక్కడికక్కడ వ్యర్థాలతో నిండిపోయి సాగునీటి ప్రవాహానికి తీవ్ర అడ్డంకి ఏర్పడుతోంది. దీంతో సరైన సమయంలో శివారు ప్రాంతాలకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి సాగునీటి వ్యవస్థకు కీలకమైన లాకులను ఆధునీకరించి శివారు ప్రాంతాలకు సక్రమంగా సాగునీటిని అందించి నాణ్యమైన పంటలు పండించాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో నీరు సాగేదిలా..

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి తూర్పు, మధ్య డెల్టా నుంచి సాగునీరు అందుతుంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి తూర్పు డెల్టాలో కోటిపల్లి వైపు చొప్పెల్ల వద్ద, సామర్లకోట వైపు కడియం వద్ద, అమలాపురం వైపు లొల్ల వద్ద ప్రధాన లాకులను ఏర్పాటు చేశారు. వాటికి అనుబంధంగా మరో 23 సబ్ లాకులను ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా ఖరీఫ్, రబీ సీజన్‌కు నీటిపారుదల శాఖ సాగునీరు అందించే ఏర్పాట్లు చేపడుతోంది. ఉమ్మడి జిల్లాలో 4.58 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపడుతున్నారు. అధికారుల గణాంకాల ప్రకారం ప్రతి సీజన్‌కు 65.428 క్యూసెక్కుల సాగునీరు అవసరమవుతోంది. అందులో ఏటా సుమారు ఐదు వేల క్యూసెక్కుల సాగునీరు వృథాగా పోతోందని అంచనా. దీనివల్ల పంట తుది దశకు వచ్చే సమయంలో నీటి ఎద్దడి ఎదురుకావడం వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. లస్కర్ల వ్యవస్థను పూర్తిగా పునరుద్ధరించడం ద్వారా పంట కాలువలపై ఆ శాఖకు అజమాయిషీ లభిస్తుంది.



శిథిలావస్థకు చేరిన ఆలమూరు లాకులు (ఫైల్)

వృథా నీటిని అరికట్టాలి



లాకుల వ్యవస్థ దెబ్బతినడం ద్వారా వృథా పోతున్న నీటిని **పూర్తిస్థాయిలో అరికట్టి ఖరీఫ్**, రబీ **సీజన్లలో శివారు ప్రాంతాలకు సైతం నీటిని అందించాలి.** లాకుల **నిర్వహణ, పంటకాలువ ఆ**ధునీకరణపై అధికారులు **నిర్లక్ష్యంగా వ్యవహరించడ**ం వల్ల ఏటా సాగునీటి **కొరత ఏర్పడుతోంది. రైతు**లు ఆవేదనను, ఆందోళ**నను ప్రభుత్వం పరిగణనలో**కి తీసుకోవాలి.

– **అడపా వీర్రాజు** (పెదబాబు), రైతు, **పీఏసీఎస్ మాజీ** అధ్యక్షుడు, సంధిపూడి, ఆలమూరు మండలం

సాగునీటి వ్యవస్థపై దృష్టి పెట్టాలి



డెల్టా ప్రాంత రైతులకు ప్రాణదాయకమైన సాగునీటి వ్యవస్థ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. లాకుల ఆధునీకరణ, పంట కాలువల్లో పూడిక తీత పనులకు యేటా ప్రభుత్వం నిధులు కేటాయించాలి. లస్కర్ల వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలి.

– నెక్కంటి వెంకట్రాయుడు (బుజ్జి), సాగునీటి సంఘం మాజీ చైర్మన్, పెదపళ్ల

సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం



నిధులు కేటాయించక పోవడం వల్ల నీటిపారుదలశాఖ వ్యవస్థ నిర్వీర్యం దిశగా పయనిస్తోంది. లాకులను పటిష్టం చేసి చాంబర్లను ఆధునీకరించి సాగునీటి వృథాను ఆరికట్టాలి. అలాగే క్రమం తప్పకుండా ఖరీఫ్, రబీ సీజన్లలో పంట కాలువల అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

– గారపాటి శ్రీనివాస చౌదరి, చింతలూరు సాగునీటి సంఘం చైర్మన్, ఆలమూరు మండలం

వంతెనకు త్వరలో బిల్లులు

- అంచనా వ్యయం రూ.71.4 కోట్లకు సవరణ
- ఊడిమూడిలంక పనులు పరిశీలించిన సీఈ అశోక్‌కుమార్

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక గ్రామాల ప్రజల కోసం వశిష్ట నదీపాయపై నిర్మిస్తున్న వంతెనకు సంబంధించి బిల్లుల విడుదలకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ ఆర్ఆర్‌పీ (రూరల్ రోడ్ ప్రోగ్రాం) ప్రాజెక్టు డైరెక్టర్, పీఆర్ సీఈ పి.అశోక్ కుమార్ చెప్పారు. వంతెన నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వరద బాధితులను పరామర్శించేందుకు ఇక్కడికి వచ్చిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లంక గ్రామాల ప్రజల కష్టాలు తెలుసుకుని రూ.49.5 కోట్లతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటికి రూ.32 కోట్ల విలువైన 60 శాతం పనులు పూర్తి అయ్యాయి. అయితే నిర్మాణ వ్యయం పెరగడంతో అంచనా వ్యయాన్ని రూ.74.1 కోట్లకు పెంచుతూ సవరించారు. ఇందులో రైతుల నుంచి సేకరించిన భూములకు రూ.2.3 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత పనులను పీఆర్ డీఈఈ అన్యం రాంబాబు ఎస్ఈకి వివరించారు.




ఊడిమూడిలంక వద్ద నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలిస్తున్న సీఈ అశోక్‌కుమార్

త్వరలో రూ.560 కోట్ల విడుదల

రాష్ట్రంలో ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నిధులతో ఏపీ ఆర్ఆర్‌పీ ప్రాజక్టు కింద రూ.3,525 కోట్లతో 2760 పనులు చేస్తున్నామని ఎస్ఈ విలేకరులకు చెప్పారు. వీటిలో 960 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం, 5 ప్రాంతాల్లో హై లెవెల్ వంతెనలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇంతవరకూ జరిగిన పనులకు రూ.1,500 కోట్లు విడుదల చేశామని, మరో 10 రోజుల్లో రూ.560 కోట్లు విడుదల చేయనున్నట్టు తెలిపారు. రహదారి పనులను 2026 మార్చి నాటికి, వంతెనల నిర్మాణ పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయాల్సి ఉందని ఆయన వివరించారు. సీఈ వెంట ఏపీ ఆర్ఆర్‌పీ ప్రాజక్టు మేనేజర్ పీవీ రమణ మూర్తి, పీఆర్ ఈఈ పులి రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యం చేస్తే కామెర్ల కాటు

- అప్రమత్తత ఎంతో అవసరం
- జిల్లాలో ఒక శాతం మందిలో ఉన్నట్టు చెబుతున్న వైద్యులు
- నేడు ప్రపంచ హెపటైటిస్ డే



రాయవరం: ప్రపంచాన్ని వణికిస్తున్న వ్యాధుల్లో కామెర్లు ఒకటి. హెపటైటిస్ వైరస్ సోకడంతో మనిషి శరీరంలో సుమారు 500 రకాల విధులు నిర్వర్తించే కాలేయం దెబ్బతింటుంది. కామెర్లను నిర్లక్ష్యం చేస్తే మనిషి ప్రాణానికే ప్రమాదకరం. హెపటైటిస్ ఎ, బి, సి, డి, ఇ వైరస్‌లు ఈ కామెర్లకు కారణమవుతున్నాయి. ఈ నెల 28న ప్రపంచ వైరల్ హెపటైటిస్ డే సందర్భంగా కామెర్ల లక్షణాలు, వ్యాధికి కారణాలను తెలుసుకుందాం.

వైరల్ హెపటైటిస్ వ్యాప్తికి కారణాలు

ప్రధానంగా కలుషిత నీరు తీసుకోవడం వల్ల కామెర్లు వస్తాయి. విచ్చలవిడి శృంగారం, అసహజ లైంగిక చర్యలు, తరచూ రక్తమార్పిడి, డయాలసిస్, డ్రగ్స్ తీసుకోవడం, మద్యపానంతో పాటు వాడిన సిరెంజి సూదులనే మళ్లీ వినియోగించడం వల్ల ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. హెచ్ఐవీ, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి కామెర్లు త్వరగా సోకే అవకాశం ఉంది.

28తేదీనే ఎందుకంటే..

2008 మే 19న హెపటైటిస్ వైరస్‌ను బారుచ్ బ్లంబర్గ్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారు. ఈ ఆవిష్కరణతో వ్యాధి నివారణకు వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. బ్లంబర్గ్ జన్మదినం జూలై 28వ తేదీని ప్రపంచ హెపటైటిస్ డేగా నిర్వహిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు.. జాగ్రత్తలు..

- కళ్లు, నీరుడు పచ్చబడతాయి.
- విపరీతమైన అలసటగా ఉంటుంది.
- అరుగుదల సరిగ్గా ఉండక పోవడం, బద్ధకం, ఒంటిపై దురదలు రావడం.
- ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే హెపటోరీనల్ కోమాకు దారి తీస్తుంది.
- మెదడు, కిడ్నీలపై ప్రభావం చూపుతుంది.
- హెపటైటిస్–బిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలం తర్వాత సిర్రోసిస్, లివర్ క్యాన్సర్‌కు దారితీసే అవకాశం ఉంది.
- వ్యాధి సోకిన తర్వాత లివర్‌కు విశ్రాంతి ఇచ్చేలా తేలికైన ఆహారాన్ని తీసుకోవాలి. గ్లూకోజ్ ఎక్కువగా తీసుకోవాలి. కొవ్వు, మాంసకృతులు తీసుకుంటూ, నూనె పదార్థాలను తగ్గించాలి.

జిల్లాలో ఇలా..

కోనసీమ జిల్లాలో హెపటైటిస్–ఎ కామెర్లు మాత్రమే ఎక్కువగా ఉంటాయి. జిల్లాలో ఒక శాతం ప్రజలకు కామెర్లు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. హెపటైటిస్ నాన్–ఎ, నాన్–బి రకం కామెర్లు సోకినా అంత ప్రమాదకరమైన స్థితిలో లేదు.

జిల్లాలో చిన్నారులకు..

బిడ్డ పుట్టిన వెంటనే 24 గంటలలోగా హెపటైటిస్–బి వ్యాధి నిరోధక టీకాలను వైద్య, ఆరోగ్యశాఖ వేస్తోంది. అనంతరం 6, 10, 14 వారాలకు ఈ టీకాను పెంటా వాలెంట్‌తో కలిపి ఇస్తున్నారు. అలాగే టీకాతో పాటు ఇమ్యునోగ్లోబలెన్స్ కూడా ఇస్తారు. ఈ సదుపాయాన్ని జీజీహెచ్‌లో ఉచితంగా అందజేస్తున్నారు. ప్రతి గర్భిణి హెచ్ఐవీ, హెపటైటిస్ రక్త పరీక్షలు చేయించుకుంటే మంచిది.

తగిన జాగ్రత్తలు అవసరం



వర్షాకాలంలో కలుషిత ఆహారం, నీరు ద్వారా హెపటైటిస్–ఎ వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉన్నందున సాధ్యమైనంత వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీరు పూర్తి రక్షణ ఇస్తుంది. గర్భిణులు అవసరమైన పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.

– డాక్టర్ బీవీవీ సత్యనారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

వేతన వేదన

- రత్నగిరి శానిటేషన్ సిబ్బంది జీతాల చెల్లింపులో మళ్లీ ప్రతిష్టంభన
- ఫేక్ పీఎఫ్ రసీదుల వ్యవహారంతో అయోమయం
- కాంట్రాక్టర్ తొలగింపు.. కేసు నమోదు
- ఇద్దరు సిబ్బంది సస్పెన్షన్‌తో కొరవడిన పర్యవేక్షణ
- ఆ బాధ్యతలు తీసుకోవడానికి వెనుకాడుతున్న సిబ్బంది
- ఈ నెల ముగిసిపోతున్నా అందని గత నెల వేతనాలు

అన్నవరం: ఆవులూ ఆవులూ కుమ్ములాడుకుని లేగ దూడల కాళ్లు తొక్కేసినట్టుగా ఉంది అన్నవరం దేవస్థానం పారిశుధ్య సిబ్బంది పరిస్థితి. రూ.30 లక్షల నకిలీ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) చలానాలు సమర్పించిన వ్యవహారంలో దేవస్థానం శానిటేషన్ కాంట్రాక్టర్ విజయవాడకు చెందిన కనకదుర్గా మ్యాన్‌పవర్ సర్వీసెస్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో దేవస్థానం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావు, గుమస్తా ఎం.రామకృష్ణను ఈఓ వీర్ల సుబ్బారావు ఇటీవల సస్పెండ్ చేశారు. గతంలో కాంట్రాక్టర్ ఉన్నప్పుడే పారిశుధ్య సిబ్బందికి జీతాలు సక్రమంగా చెల్లించేవారు కాదు. ఈ విషయాన్ని 'సాక్షి' పలు సందర్భాల్లో వెలుగులోకి తీసుకుని రావడంతో జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకునేవారు. ఈ నెలలో 27 రోజులు గడచినప్పటికీ జూన్ నెల జీతాలు ఇంకా ఇవ్వలేదు. ఇప్పుడు ఫేక్ పీఎఫ్ చలానాల వ్యవహారంలో కాంట్రాక్టర్‌ను తొలగించడంతో దేవస్థానంలో పని చేస్తున్న 350 మంది పారిశుధ్య సిబ్బందికి జీతాల చెల్లింపు ప్రశ్నార్థకంగా మారింది.

'సాక్షి' కథనంతో..

దేవస్థానంలో ఏ టెండరూ పిలవకుండా, ఎటువంటి డిపాజిట్ లేకుండానే నెలకు రూ.59 లక్షలు చెల్లించేలా కనకదుర్గా మ్యాన్‌పవర్ సర్వీసెస్‌కు గత మార్చి నెలలో శానిటేషన్ కాంట్రాక్ట్‌ను నామినేషన్ పద్ధతిలో అప్పగించిన విషయం విదితమే. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ ప్రతి నెలా సిబ్బంది జీతంలో 22.5 శాతం (12.5 శాతం దేవస్థానం వాటా, 10 శాతం ఉద్యోగి వాటా) అంటే సుమారు రూ.10 లక్షలు పీఎఫ్ చెల్లించాలి. ఆ రశీదు దేవస్థానానికి జమ చేస్తే, దానిని పరిశీలించి శానిటేషన్ సిబ్బంది జీతాలు చెల్లించేందుకు రూ.59 లక్షల బిల్లును దేవస్థానం ఆమోదించేది. అయితే గత మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఆ కాంట్రాక్టర్ ఫేక్ పీఎఫ్ రసీదులు సృష్టించి రూ.1.77 కోట్ల మేర బిల్లు చేయించుకున్నారు. తమ ఖాతాల్లో పీఎఫ్ పడలేదని గుర్తించిన పారిశుధ్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేయడంతో దేవస్థానం అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి మూడు నెలల పీఎఫ్ మొత్తం తిరిగి జమ చేయించారు. ఇలా చేస్తే ఏ గొడవా ఉండదని అధికారులు, కాంట్రాక్టర్ కూడా భావించారు. దీనిపై 'అన్నవరంలో శానిటేషన్ కాంట్రాక్టర్ మోసం' శీర్షికన ఈ నెల 17న సాక్షి వార్త ప్రచురించడంతో ఈ స్కామ్ వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పీఎఫ్ అధికారుల విచారణ అనంతరం కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి, ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు.



సత్యదేవుని ఆలయ ప్రాంగణం శుభ్రపరుస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఎవరి ఒత్తిళ్లతో చేశారో!

ఏ ప్రభుత్వ శాఖలోనైనా ఒక భవనం నిర్మించడానికి కాంట్రాక్ట్ పొందిన వ్యక్తికి మరో భారీ భవనం నిర్మించే కాంట్రాక్ట్ ఎంతమాత్రం ఇవ్వరు. ఆ భారీ భవనం నిర్మాణానికి కూడా టెండర్ పిలిచి కాంట్రాక్టర్‌ను ఖరారు చేస్తారు. కానీ, అన్నవరంలో మాత్రం ఇలాగే చేశారు. కేవలం 34 మంది సిబ్బందిని సరఫరా చేయడానికి టెండర్ ద్వారా ఎంపిక చేసిన కనకదుర్గా మ్యాన్‌పవర్ సర్వీసెస్‌కే ఎటువంటి టెండర్ పిలవకుండా 350 మంది పారిశుధ్య సిబ్బందిని సరఫరా చేసే కాంట్రాక్ట్‌ను గత మార్చి నెలలో అప్పగించేశారు. దీనికి దేవస్థానం అధికారులు ప్రతిపాదన పంపడం.. కమిషనర్ వెంటనే అనుమతి ఇవ్వడం జరిగిపోయాయి. నెలకు రూ.59 లక్షలు చెల్లించే ఈ భారీ కాంట్రాక్ట్‌ను ఇలా ఎందుకు అప్పజెప్పారు.. దీని వెనుక ఎవరి ఒత్తిళ్లున్నాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ద్వారకా తిరుమల దేవస్థానంలో పారిశుధ్య నిర్వహణకు సెవెన్ హిల్స్ సంస్థ పొందిన కాంట్రాక్ట్ గత ఏడాది అక్టోబర్‌తో ముగిసింది. టెండర్ పిలవకుండా కాంట్రాక్ట్ ఇవ్వాలని చాలా మంది ఒత్తిళ్లు తెచ్చినా అక్కడి అధికారులు లొంగలేదు. అన్నవరం దేవస్థానంలో కనకదుర్గ మ్యాన్‌పవర్ సంస్థకు అప్పగించారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జీతాల చెల్లింపు ఎలా?

ఫేక్ పీఎఫ్ చలానాల వివాదం నేపథ్యంలో పారిశుధ్య సిబ్బందికి వేతనాలు ఏవిధంగా చెల్లించాలనే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. జూన్ నెల జీతాల చెల్లింపునకు దేవస్థానం సెక్యూరిటీ కాంట్రాక్టర్ సహకారం కోరారు. ఆ కాంట్రాక్టర్ దేవస్థానంలో 60 మంది సెక్యూరిటీ సిబ్బందిని సరఫరా చేస్తున్నారు. పారిశుధ్య సిబ్బందిని కూడా అతడే సరఫరా చేసినట్లు చూపించి, అతడి ద్వారానే పీఎఫ్ కట్టించి, జీతాలు చెల్లించే ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. దీనికి కమిషనర్ కూడా అంగీకరించారని చెబుతున్నారు. ఈవిధంగానైనా తమకు నెలాఖరులోగా జీతాలివ్వాలని సిబ్బంది కోరుతున్నారు.

నేడు ప్రైవేట్ పాఠశాలల సమావేశం

అమలాపురం రూరల్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, వినియోగదారుల హక్కుల సంఘాల ప్రతినిధులతో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల హక్కులపై ప్రైవేట్ పాఠశాల యాజమాన్య స్థాయిలో చర్చలు జరుపుతారని ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా ఒక ప్రకటనలో కోరారు.

వాడపల్లి స్వామికి దండిగా ఆదాయం

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి ఆదివారం దండిగా ఆదాయం లభించింది. స్వామివారిని విశేషంగా భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, వేదాశీర్వచనం, అన్న ప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదాల విక్రయం, ఆన్‌లైన్ తదితర సేవల ద్వారా దేవస్థానానికి ఈ ఒక్కరోజే రూ.6,73,949 ఆదాయం వచ్చిందని దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈఓ నల్లం చక్రధరరావు వివరించారు. ఆలయంలో నిత్య పూజా కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి నిత్య కల్యాణంతో పాటు ఏడు ప్రదక్షిణలు చేసిన భక్తులు అష్టోత్తర నామార్చనలు చేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి
ఆమె తమ్ముడి పరిస్థితి విషమం

రాజానగరం: జాతీయ రహదారిపై గైట్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో అక్క మృతి చెందగా, తమ్ముడు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొవ్వూరుకు చెందిన రాచర్ల మేరీబాయ్ (58) తన తమ్ముడు తాతపూడి విజయకుమార్ (57)తో కలిసి బైకుపై రాజానగరం మండలం, ఫరిజల్లిపేటలోని చర్చికి వచ్చి, తిరిగి వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. వారు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. లారీ చక్రం మేరీభాయ్ పై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, విజయకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

పోలవరం కాలువలో పడి కార్మికుడు..

సీతానగరం: మండలంలోని అచ్చియ్యపాలెం దగ్గరలో గల పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువలో ప్రమాదవశాత్తు పడి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దీపక్ సింగ్ (23) మృతి చెందాడని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు దీపక్ సింగ్ పోలవరం ప్రాజెక్టులో పని చేస్తున్నాడని, ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం ప్రాజెక్టు ఎడమ కాలువలో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అదుపుతప్పి పడి మరణించాడని ఎస్సై తెలిపారు. మృతుడు జార్ఖండ్ రాష్ట్రంలో టాటా జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలవరం ప్రాజెక్టు పనులకు కార్మికులను సప్లై చేసే కాంట్రాక్టర్ జితేష్‌కుమార్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఆయన వివరించారు.

సోషల్ మీడియా ఉచ్చులో బాలికలు

- అదృశ్యమైనట్టు కేసు నమోదు
- స్వల్ప వ్యవధిలో పట్టుకున్న పోలీసులు

కోరుకొండ: మండలంలోని రాఘవపురానికి చెందిన ఇద్దరు బాలికలు ఆదివారం అదృశ్యమయ్యారు. తప్పిపోయిన వారిద్దరిని కోరుకొండ పోలీసులు కనుగొని వారి కుటుంబాలకు అప్పగించారు. కోరుకొండ ఎస్సై కూన నాగరాజు తెలిపిన వివరాల మేరకు శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన బాలికలు, తిరిగి ఇంటికి రాలేదు. దీంతో వారి తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు అందిన కొన్నిగంటల్లో పోలీసులు బాలికలను పట్టుకున్నారు. సోషల్ మీడియా పరిచయాల ద్వారా అమ్మాయిలు బయటకు వెళ్లారని పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా కోరుకొండ సీఐ సత్యకిషోర్ విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియా పట్ల యువత ఆకర్షితులు కావద్దన్నారు. విద్యార్థినులు సోషల్‌మీడియా ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అందులో పరిచయాలను విద్యార్థినులు వ్యతిరేకించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పెద్దాపురం: స్థానిక వడ్లమూరు రహదారిలోని పంటకాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని స్థానిక ఎస్‌ఐ మౌనిక తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయసున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడన్నారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 94409 04846, 94409 04844 నంబర్లను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

మూగజీవాలకూ హక్కులున్నాయ్..

- పశువులు, వన్యప్రాణులను చంపడం నేరం
- జంతు రవాణాలో జాగ్రత్తలు అవసరం



వాహనంలో కిక్కిరిసి పశువుల తరలింపు (ఫైల్)

రాయవరం: శారీరకంగా ఎక్కువగా బాధిస్తే, గొడ్డును బాదినట్లు బాదారు అంటారు. పశువు కన్నా హీనంగా ప్రవర్తించాడంటారు. అంటే పశువులను ఇష్టం వచ్చినట్లు దండించవచ్చని, అవమానించవచ్చని చాలా మంది ఉద్దేశం. వాటికి నోరు లేదు కాబట్టి ఎవరికీ తమ బాధ చెప్పుకోలేవు. అలాంటి మూగజీవాల రక్షణకు చట్టాలు ఉన్నాయన్న సంగతి చాలా మందికి తెలియని విషయం. అయితే మనుషులకే కాదు జంతువులకూ హక్కులుంటాయని మాచవరం పశు వైద్యురాలు ఎం.బిందు వివరించారు. అకారణంగా జంతువులను హింసిస్తే జరిమానాతో పాటు జైలుశిక్ష కూడా విధించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. జంతువుల రవాణా, పెంపకంలోనూ వాటికి ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవల కాలంలో మూగజీవాలు, పశువులను విచక్షణా రహితంగా వాహనాల్లో తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో పశువులను చిన్న చిన్న వాహనాల్లో కుక్కి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. మూగజీవాల రక్షణ కోసం ప్రభుత్వం పలు చట్టాలు చేసింది. వాటిని అమలు పరిచేందుకు వివిధ విభాగాల అధికారులతో కమిటీలు వేసింది. అయినప్పటికీ పశువుల హక్కుల ఊసెక్కడా కన్పించడం లేదు. జంతువులను క్రూరంగా హింసిస్తూ ఆటోలు, లారీల్లో రవాణా చేస్తుంటారు. పశువుల మార్కెట్ నుంచి పశు సంపదను ఒకచోట నుంచి మరోచోటకు తరలించే క్రమంలో తీవ్ర హింసకు గురిచేస్తున్నారు. అలాగే పంట చేను మేసిందనే కోపంతో కొందరు పశువులను ఇష్టం వచ్చినట్లు బాదినా, నోరులేని పశువులు ఆ దెబ్బలను మౌనంగా భరిస్తూ ఉంటాయి. మానవ మనుగడకు సహాయపడుతూ జీవించే జంతుజాలం కోసం చట్టం ఏం చెబుతుందంటే..

చట్టం... జరిమానాలు

- జంతువులపై క్రూరత్వ నివారణ/ నిరోధక చట్టం 1960లో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం వాహనాల్లో ఓవర్ లోడింగ్, తీవ్రంగా కొట్టడం, చిత్రహింసలకు గురిచేయడం, నొప్పిని కలిగించే చర్యలను క్రూరత్వంగా పరిగణిస్తారు.
- పది రూపాయలకు పైన విలువ చేసే ఏ జీవినైనా హింసిస్తే భారత శిక్షాస్మృతి కింద నేరమవుతుంది.
- చిన్న వయసులో ఉన్న పశువులను, వ్యాధి బారిన పడిన వాటిని గానీ ఎలాంటి పనులకూ ఉపయోగించరాదు.
- అవసరం కోసం లేదా కావాలని పశువుల శరీరానికి హాని కలిగించే మందులు, పదార్థాలను ఇవ్వకూడదు. కొందరు పశువుల యజమానులు పాల దిగుబడిని పెంచేందుకు అనవసరంగా మందులను ఇచ్చి బాధిస్తూ ఉంటారు. ఇలాంటి వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా పడుతుంది.
- పశువులను ఒకచోట నుంచి మరోచోటకు తరలిస్తున్నప్పుడు వ్యాన్లు, ఆటోల్లో కిక్కిరిసేలా ఉంచరాదు. వాటికి బాధ కలిగించకుండా తరలించే ఏర్పాటు చేయాలి. ఒక వాహనంలో పరిమితికి మించి పశువులను తరలించడం నేరం.
- అలాగే పశువులు, జంతువులను ఎక్కువ సేపు కట్టేసి ఉంచడం కూడా నేరమే.
- జంతువులు, పక్షులను పందెం కోసం వాడడం, చిత్రహింసకు గురిచేయడం, చంపడాన్ని చట్టం నిషేధించింది.
- వధశాలలు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలి. చూడితో ఉన్న, మూడు నెలల కంటే తక్కువ వయసున్న జంతువులను వధించరాదు. పశు వైద్యాధికారి పరీక్షించిన తర్వాతే జంతువును వధించాలి. లేదంటే నేరంగా పరిగణిస్తారు.

వన్యప్రాణులకూ రక్షణ

వన్య ప్రాణులను వేటాడడం, వాటిని ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలు శిక్షార్హం. ఇలాంటి నేరాలకు పాల్పడితే సెక్షన్-1 (ఏ) ప్రకారం జరిమానా విధిస్తారు. మూడేళ్లలో మరోసారి ఇలాంటి తప్పు చేసినట్లు రుజువైతే జరిమానాతో పాటు మూడు నెలల శిక్ష కూడా విధిస్తారు.

పరిశీలించిన తర్వాతే రవాణా



పశువులు, జంతువులను రవాణా చేసేటప్పుడు స్థానిక పశువైద్యాధికారి వాటిని పరిశీలించి, అవి ఆరోగ్యంగా ఉన్నాయని నిర్ధారించిన తర్వాతే తరలించాలి. అప్పుడే ఈనిన పశువు లేదా అనారోగ్యంతో ఉన్న పశువును తరలించడం నేరం. చూడితో ఉన్న పశువు, లేగదూడలను వేరే పశువులతో కలిపి రవాణా చేయడం నేరం.

– ఎం.బిందు, పశు వైద్యాధికారి, మాచవరం

ప్రత్యేక నిఘా ఏర్పాటు



మూగజీవాలను హింసిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. వాటి హక్కుల రక్షణకు చట్టాలున్నాయి. వాటిని అక్రమంగా తరలించడంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం ఇస్తే కేసులు నమోదు చేసి, మూగజీవాలను రక్షిస్తాం.

– బి.రఘువీర్, డీఎస్పీ, రామచంద్రపురం

పశువుల అక్రమ తరలింపుపై కేసు



లారీలో అక్రమంగా తరలిస్తున్న పశువులు

గండేపల్లి: పశువుల అక్రమ తరలింపుపై కేసు నమోదు చేసినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని గండేపల్లి జాతీయ రహదారిపై ఎస్సై యు.వి.శివనాగబాబు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీలో తుని నుంచి చిలకలూరిపేటకు అక్రమంగా తరలిస్తున్న 4 ఆవు దూడలు, 12 ఎద్దులను గుర్తించి వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు తెలియజేశారు

వ్యక్తి మృతికి కారణమైన యువకుడి అరెస్ట్

రామచంద్రపురం రూరల్: ఈ నెల 22వ తేదీ రాత్రి సుమారు 11.45 గంటలకు జగన్నాయకులపాలెం గ్రామంలో ప్రధాన రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వెళుతున్న తాళ్లపాలెం గ్రామానికి చెందిన వనుం కృష్ణను గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోగా అతడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి కారణమైన కారును గుర్తించినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ప్రమాద సంఘటన జరిగిన తరువాత ఆ స్థలంలో లభించిన కారు సైడ్ మిర్రర్, సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా కారు మండపేటలోని దుర్గా మల్లేశ్వరి మెకానికల్ షెడ్‌లో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కారును స్వాధీనం చేసుకోవడంతో పాటు, తనకు అందిన సమాచారం మేరకు రామచంద్రపురానికి చెందిన కారు డ్రైవర్ దామిశెట్టి వెంకట వర్షిత్‌ను జగన్నాయకులపాలెం గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు దాటిన తరువాత గున్నయ్య తూము వద్ద ఆదివారం అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

మహిళలకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ

- ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ పట్టభద్రులకు ఆ దేశంలో ఉద్యోగ అవకాశాలు
- జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి

అమలాపురం రూరల్: ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ మహిళలకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. నర్సింగ్ పట్టభద్రులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, గిరిజన సంక్షేమం, సామాజిక సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తిరుపతి, గుంటూరు, విశాఖపట్నంలోని కేంద్రాల్లో ఈ శిక్షణ జరగనుందన్నారు. 35 ఏళ్ల లోపు వయసు కలిగి, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఇందుకు అర్హులని, శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారని ఆమె తెలిపారు. డాక్యుమెంట్ల అనువాదం, అటెస్టేషన్ ఖర్చులు, బీ2 జర్మన్ భాష పరీక్ష ఫీజు, వీసా, విమాన టికెట్ల ఖర్చులు ఉద్యోగదారులు భరిస్తారన్నారు ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు సుమారు రూ.2.4 లక్షల నుంచి రూ.3.1 లక్షల వరకు జీతం లభిస్తుందని, ఆసక్తి ఉన్నవారు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు ఏడో తేదీలోపు https://naipunyam.ap.gov.in/userregistration?page=program-cregistration నమోదు చేసుకోవాలని, లేదా skillinternational@apssdc.in రెస్యూము ఈమెయిల్ చేయవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

నేడు జాబ్ మేళా

వికాస, నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రామచంద్రపురం మోడరన్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 దిగ్గజ కంపెనీల మానవవనరుల ప్రతినిధులు సుమారుగా 757 ఖాళీలను భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేస్తూ నియామక ఉత్తర్వులు అందిస్తారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసి 35 ఏళ్ల లోపు వయసు కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు.

డైరెక్టర్ల అసమర్థత వల్లే అన్యాయం

- జయలక్ష్మి సొసైటీ బాధితుల ఆవేదన
- పాతవారి స్థానంలో కొత్త డైరెక్టర్లను ఎన్నుకోవాలని కార్యాచరణ ప్రణాళిక
- అమలాపురం సమావేశంలో నిర్ణయం



సమావేశంలో చర్చిస్తున్న జయలక్ష్మి సొసైటీ బాధితులు

అమలాపురం టౌన్: జయలక్ష్మి ఎంఏఎం కోపరేటివ్ సొసైటీ ప్రస్తుత బోర్డు డైరెక్టర్ల అసమర్థత వల్లే బాధితులకు నేటికీ అన్యాయం జరుగుతోందని బాధితుల స్టీరింగ్ కమిటీ కన్వీనర్ యిారంకి రఘు భూషణ్ ఆవేదన వ్యక్తం చేశారు. బోర్డు డైరెక్టర్లు తక్షణం రాజీనామా చేసి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమలాపురంలోని ఏఎస్‌ఎన్ కళాశాల ప్రాంగణంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన సొసైటీ బాధితులు ఆదివారం సమావేశమై బోర్డులో జరుగుతున్న అవకతవకలపై చర్చించారు. సొసైటీ బోర్డు తిప్పేసి ఏళ్లు గడుస్తున్నా బాధితులకు ఒక్క రూపాయి కూడా న్యాయం జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సొసైటీ అమలాపురం బ్రాంచి బాధితుడు టీవీడీఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ సొసైటీలో ప్రస్తుతం జరుగుతున్న అవకతవకలను సమావేశానికి వివరించారు. సొసైటీ బాధితుడు, విశ్రాంత బ్యాంక్ అధికారి గుళ్లపల్లి వెంకటరామ్ మాట్లాడుతూ పారదర్శకత లేని ప్రస్తుత బోర్డు వల్ల బాధితులకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. ఇప్పటి వరకు 80 మంది డిపాజిటర్లు మరణించారని, బాధితులకు న్యాయం చేయలేని అమలాపురానికి చెందిన ఇద్దరు డైరెక్టర్లు తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్క అమలాపురం శాఖ పరిధిలోనే దాదాపు రూ.50 కోట్ల వరకూ డిపాజిట్లు చేసి నష్టపోయారని పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన అమలాపురానికి చెందిన బోర్డు డైరెక్టర్లు స్వామి ప్రసాద్, గవర్రాజు కుమార్‌లను బాధితులు తమ డిపాజిట్ల కోసం నిలదీసినా వారి నుంచి సరైన సమాధానం రాలేదు. సొసైటీ బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేసి డైరెక్టర్ల చేత రాజీనామాలు చేయించి తాజాగా కొత్త బోర్డును నియమించాలని సమావేశం నిర్ణయిస్తూ ఓ కార్యచరణ ప్రకటించింది. సొసైటీలో డిపాజిట్లు చేసి మోసపోయిన బాధితులంతా ఒక తాటిపై ఉండి తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని తీర్మానించింది. సమావేశంలో మహిళా బాధితులు కూడా వచ్చి తమ నిరసన తెలియజేశారు. సమావేశంలో సొసైటీ బాధితులు పుత్సా కృష్ణ కామేశ్వర్, వి.సుబ్బారావు, కస్తూరి రవికుమార్, పిల్లి గణేష్, చక్రవర్తి, బదరీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యను కడతేర్చాడు

- కొంతమూరు సంతోష్‌నగర్‌లో ఘటన
- పరారీలో నిందితుడు

రాజానగరం: అనుమానం పెనుభూతమైంది. కొంతకాలంగా గొడవ పడటం, వేధింపులకు పాల్పడడం, అది చాలదన్నట్టు అమానుషంగా రాతితో తలపై కొట్టి ఆమె మృతికి కారకుడయ్యాడు ఓ భర్త.

స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని కొంతమూరు శివారు సంతోష్‌నగర్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ వీరయ్యగౌడ్ ఆదివారం ఇక్కడ మీడియాకు తెలిపిన వివరాలిలావున్నాయి. సంతోష్‌నగర్‌లో నివసిస్తున్న నల్లమాటి లక్ష్మి పెద్ద కుమార్తె ఉషారాణికి పదేళ్ల క్రితం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని గిడుతూరుకు చెందిన వేమగిరి మాణిక్యంతో వివాహం జరిగింది. అనంతరం అత్తవారింటికి వచ్చిన మాణిక్యం సంతోష్ నగర్‌లో వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. వీరికి ఒక అబ్బాయి (9), ఒక అమ్మాయి (7) సంతానం. భార్యపై అనుమానంతో తరచూ గొడవ పడుతూ, వేధిస్తుండేవాడు. భర్త వేధింపులపై ఉషారాణి గతంలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా అతనిలో మార్పు రాకపోగా వేధింపులు మరింత పెరిగాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్యతో గొడవ పడ్డాడు. కోపంతో ఆమెను రాయితో తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా రక్తస్రావమైంది. మనవడు, మనుమరాలి ద్వారా విషయం తెలుసుకున్న ఉషారాణి తల్లి లక్ష్మి హుటాహుటిన అక్కడకు చేరుకుని, రక్తపు మడుగులో ఉన్న కుమార్తెను స్థానికుల సాయంతో చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లింది. అప్పటికే ఆమె మృతి చెందిందని పరీక్ష చేసిన వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితుడు మాణిక్యం పరారీలో ఉన్నాడు.

నీట్ కౌన్సెలింగ్‌పై అవగాహన



నీట్ కౌన్సెలింగ్‌పై మాట్లాడుతున్న జాయింట్ రిజిస్ట్రార్ సుబ్బారావు

కంబాలచెరువు: ఎంబీబీఎస్ నీట్ కౌన్సెలింగ్‌పై శశి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఇందుకూరి కల్యాణ మండపంలో అవగాహన సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా తెలంగాణ కాళోజీ హెల్త్ యూనివర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు హాజరై మాట్లాడారు. వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ పక్రియతో పాటు వెబ్ ఆప్షన్లను ఎంచుకునే విషయంలో అవగాహన కలిగి వుండాలన్నారు. రిజిస్ట్రేషన్ పక్రియ మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లలో చేయకూడదని, డెస్క్‌టాప్, లాప్‌టాప్‌లలో మాత్రమే చేయాలన్నారు. ఏపీలో ఏయూకు 65.62, ఎస్‌యూకు 34.38 శాతం సీట్లను కేటాయించారన్నారు. కౌన్సెలింగ్ పూర్తయ్యే వరకు అన్ని అప్‌డేట్‌లను వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్, డైరెక్టర్ చిట్టూరి శేషబాబు, మన్నెం వెంకటేశ్వరరావు, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



పంతాడి చిన్న (ఫైల్)

కొత్తపేట: స్థానిక బండారుపేటకు చెందిన పంతాడి చిన్న (21) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేపల వేటకు వెళుతూ జీవించే చిన్న నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన అర్చనను ప్రేమ వివాహం చేసుకున్నాడు. శనివారం బండారుపేటలో ఒక కార్యక్రమానికి వెళ్లిన చిన్న తిరిగి ఇంటికి రాలేదు. గ్రామంలోనూ బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం తెల్లవారుజామున ఆ పేటకు ఎదుట కాలువ అవతల ఒక రైతుకు చెందిన పశువుల రేకుల షెడ్డులో ఐరన్ గడ్డర్‌కు ఉరివేసుకుని వేళ్లాడుతుండగా రైతు గుర్తించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు పోలీసులకు తెలియ చేయడంతో ఎస్సై జి.సురేంద్ర సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పీఎం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చిన్న తండ్రి తాతారావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కొంతమూరులో..



ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న దృశ్యం

రాజానగరం: ఉపాధి కోసం రాష్ట్రం వదలి వచ్చాడు. ఏమైందో గానీ తాను పని చేస్తున్న చోటనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరులో ఆదివారం ఘటన చోటుచేసుకుంది. జార్ఖండ్‌కి చెందిన దివాకర్‌కుమార్ రవాని (21) ఉపాధి కోసం వచ్చి కొంతకాలంగా కొంతమూరు, గామన్ బ్రిడ్జి రోడ్డులో ఉన్న శ్రీరామ మెటల్ పీవీసీ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్నాడు. అక్కడ పనిచేస్తున్న కొంతమందితో కలసి సమీపంలో ఉన్న ఒక గదిలో నివసిస్తున్నాడు. శనివారం రాత్రి గదికి వచ్చిన అతను రాత్రి 10 గంటల వరకు ఎవరితోనే ఫోన్ మాట్లాడుతూనే ఉన్నాడని, తెల్లవారాక చూసే సరికి ఆ గదికి వెనుక భాగంలో ఉన్న వంట గదిలోని ఐరన్ రాడ్‌కి ప్లాస్టిక్ తాడుతో ఉరివేసుకున్నాడని సహచరులు తెలిపారు. ఏదైనా ప్రేమ వ్యవహారమేమోననే అనుమానం వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత?

సీతానగరం: మండలంలోని నల్గొండ దగ్గరలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని విశ్వసనీయ సమాచారం. ఆదివారం గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని నల్గొండ – సీతానగరం మధ్యలో పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరిని రాజమహేంద్రవరానికి విచారణ నిమిత్తం తరలించారు. విచారణ అనంతరం రెండు రోజుల్లో పూర్తి వివరాలను తెలియజేస్తామని పోలీసులు వివరించారు.

మహిళకు తప్పిన ప్రాణాపాయం

- ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడుతుండగా కాపాడిన పోలీసులు



ఆత్మహత్యకు యత్నించిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న పీసీ వెంకటేష్

ధవళేశ్వరం: కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడుతున్న మహిళను ధవళేశ్వరం పోలీసులు రక్షించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ధవళేశ్వరం టిడ్కో గృహ సముదాయానికి చెందిన 28 ఏళ్ల మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. ఈ క్రమంలో ఆమె తన బావకు ఫోన్‌చేసి విషయం చెప్పింది. దీంతో ఆయన 112కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదుచేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ టి.గణేష్ కానిస్టేబుల్ వెంకటేష్‌ను నాలుగు నిమిషాల వ్యవధిలో ఘటనాస్థలానికి పంపగా ఆయన వెంటనే తలుపులు పగులగొట్టి ఉరివేసుకోబోతున్న మహిళను కిందకు దించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహిళ ప్రాణాలు కాపాడిన పీసీ వెంకటేష్, ఇన్‌స్పెక్టర్ గణేష్, కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఎస్పీ డి.నరసింహకిశోర్ అభినందించారు.

మహిళ మెడలో మంగళ సూత్రాల అపహరణ



సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించిన బైక్ పై వెళ్తున్న ఇద్దరు నిందితులు

రావులపాలెం: ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తన మెడలోని ఐదు కాసుల మంగళ సూత్రాలు, బొందు లాక్కుని పోయారంటూ ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన సత్తి రాజ్యలక్ష్మి స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఒక టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు హోటల్ నుంచి ఇంటికి వెళ్తున్నట్టుగానే వెళుతుండగా ఆదిలక్ష్మి నగర్ మూడో వీధి వద్ద బండి పై వెళ్తున్న ఇద్దరు తను వెనక వచ్చి పార్కు సమీపంలో తన ఇంటి వద్ద బండి పార్కింగ్ చేస్తుండగా మెడలోని ఐదు కాసుల సూత్రాలు, బొందును లాక్కుని పారిపోయారని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు నిందితులను గుర్తించి వారి ఛాయాచిత్రాలను ఆదివారం సీఐ ఎం శేఖర్ బాబు విడుదల చేశారు. పై చిత్రంలో ఉన్న ఇద్దరు రావులపాలెం పరిసర ప్రాంతాల్లో కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

యువకుడి అసభ్య ప్రవర్తనపై కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల శివారు వెల్లసావరం గ్రామంలో 8 వ తరగతి చదువుతున్న బాలికపై అసభ్యంగా ప్రవర్తిస్తున్న అదే గ్రామానికి చెందిన బేసే సురేష్ అనే యువకునిపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. బాలికను సదరు యువకుడు అసభ్యమైన మాటలతో, సైగలతో తరచుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెత్తలో చిత్తై..



అందమైన లోకమనీ.. రంగురంగులుంటాయని అందరూ అంటుంటారు రామ రామా.. అంత అందమైంది కానేకాదని ఓ కవి వాక్యం. నిజమే కదా. కొందరి జీవితాలు నిర్వచనాలకు అందనివి. వివర్ణమైన జీవనాన్ని ఎవరు ఆశిస్తారు? బరువైన బతుకుదెరువు ఎవరైనా ఎంచుకుంటారా? విధిరాతగా ఎంచి ఓ నిట్టూర్పు విడవడం తప్ప. ఈ శ్రమజీవిని కన్న తల్లి తన బిడ్డ ఇలా జీవించాలని కోరుకుంటుందా? ఎంత అగత్యమో కదా..? పూట గడవడానికి ముక్కుపుటాలు అదిరే మురుగునీటిలో తేలియాడే ప్లాస్టిక్, గాజు సీసాల సేకరణే జీవనాధారం కావాలా? చెత్తలో చిత్తైన జీవనపోరాటం ఎన్నాళ్లో..! రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్ వీరభద్రపురం ప్రధాన డ్రైనేజీలో ఓ శ్రామికుని జీవనమిది.

– ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)